నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 11 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

గాలివాన బీభత్సం

బజార్ ఏరియాలో బిల్డింగ్‌పై పడిపోయిన హోర్డింగ్

బెల్లంపల్లి, ఏప్రిల్ 10 : పట్టణంలో బుధవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. మెయిన్ బజార్ ఏరియాలోని స్టేట్ బ్యాంకు ముందు దుకాణా సముదాయాలపై ఏర్పాటు చేసిన భారీ హోర్డింగ్ దిమ్మెలు కూలిపోయాయి. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. హోర్డింగ్ కిందపడి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు చెబుతున్నారు. రడగంబాల బస్తీ ప్రాథమికోన్నత పాఠశాల భవన రేకులు గాలికి పక్కకు ఒరిగాయి. గదిలోకి వర్షపు నీరు చేరగా, గురువారం విద్యార్థులు కూర్చునేందుకు ఇబ్బందులు పడ్డారు. శివాలయం, రైల్వే స్టేషన్ తదితర ఏరియాల్లో చెట్లు రోడ్డుపై విరిగి పడ్డాయి. రాకపోకలకు ప్రజలు తిప్పలు పడ్డారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు సింగరేణి, ప్రభుత్వ విద్యుత్ సరఫరాను నిలిపి వేయగా, ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు.

రేషన్ కార్డుల్లో తప్పులు

అత్తగారి రేషన్ కార్డులో నమోదైన సూర్య ప్రకాశ్, ఆయన పాప నైనిక పేర్లు

కాసిపేట, ఏప్రిల్ 10 : రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి పేర్లు ఇతరుల రేషన్ కార్డుల్లో నమోదు కావడం గందరగోళానికి దారి తీసింది. కోమటిచేను గామానికి చెందిన దుర్గం సూర్య ప్రకాశ్ నూతన రేషన్ కార్డు కోసం తన భార్య స్నేహ, కూతురు నైనిక పేర్లతో దరఖాస్తు చేశాడు. కొత్త రేషన్ కార్డు రాక పోగా, తనతో పాటు తన కూతురు పేరు శ్రీరాంపూర్‌లో ఉండే అత్త గోమాస పోసక్క రేషన్ కార్డులో నమోదైంది. ఇక భార్య పేరు మొత్తానికే కనిపించలేదు. గ్రామానికి చెందిన పలువురు కూడా ఇలాంటి సమస్యనే ఎదుర్కొన్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదని, అధికారులు చొరవ చూపి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ భోజన్నను వివరణ కోరగా.. టెక్నికల్‌గా అలా అయ్యే అవకాశం లేదని, దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

చివరికి..

అరిగోస తప్పదా..!

గొల్లవాగు ప్రాజెక్టుపై నిర్లక్ష్యం.. రైతన్నకు శాపం

- షటర్లు శిథిలమై వృథాగా పోయిన నీరు
- ప్రస్తుతం డెడ్‌స్టోరేజీకి జలాశయం
- చివరి వరకూ తడి అందుతుందో లేదోనని అన్నదాతల ఆందోళన
- ఇప్పటికే అర్కపల్లిలో 100 ఎకరాల్లో ఎండిన పంట



గొల్లవాగు ప్రాజెక్ట్‌లో పూర్తిగా తగ్గిన నీటిమట్టం

గొల్లవాగు ప్రధాన కాల్వ నుంచి పారుతున్న నీరు

❖ ప్రతిపాదనలు పంపాం

గొల్లవాగు ప్రాజెక్టు షటర్ల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రైతులకు చివరి వరకు సాగు నీరు అందుతుంది. గొల్లవాగు ప్రాజెక్టు డెడ్ స్టోరేజీకి చేరలేదు. వచ్చే నెలలో డెడ్ స్టోరేజీకి వచ్చే అవకాశాలు ఉంటాయి. జూన్‌లో వర్షాలు పడితే యథావిధిగా వరద వచ్చి చేరుతుంది. రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. 8 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది

- అఖిల్, ఇరిగేషన్ ఏఈ

❖ చెరువు నింపాలి

గొల్లవాగు ప్రాజెక్టు మా ఊరికి కూత వేటు దూరంలోనే ఉంటుంది. కానీ సాగు నీరు రావడం లేదు. 100 ఎకరాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. అధికారులు, పాలకులు చొరవ తీసుకొని సాగు నీరు వచ్చేలా చూడాలి. మా ఊరి శివారు ప్రాంతంలోని చెరువు నింపితే ఉన్న పంటలనైనా కాపాడుకోవచ్చు.

- గాలిపెల్లి నాగభూషన్, రైతు, అర్కపల్లి

గొల్లవాగు ప్రాజెక్టులో షటర్లకు వెల్డింగ్ చేస్తున్న కార్మికులు

భీమారంలోని అర్కపల్లి శివారులో ఎండిన పొలం

అధికారుల నిర్లక్ష్యం వల్లే సాగు నీటికి ఇబ్బందులు

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్

భీమారం, ఏప్రిల్ 10 : గొల్లవాగు ప్రాజెక్టుపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే రైతులు సాగు నీటికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం భీమారం మండల కేంద్రంలోని గొల్లవాగు ప్రాజెక్టును నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గొల్లవాగు ప్రాజెక్టు తూములో ఉన్న షటర్లు తుప్పు పట్టి పోయాయని, వానకాలంలో ప్రాజెక్టులోని నీరంతా వృథాగా పోయిందన్నారు. సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరిందని తెలిపారు. కట్టపై నుంచి పొలాలకు వెళ్లేందుకు ఉన్న సర్వీస్ రోడ్డును అధికారులు తీసివేశారని, వెంటనే రోడ్డు ఏర్పాటు చేయలని కోరారు. మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చెన్నూర్‌లో రూ. 100 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారని, కానీ, ఇప్పుడున్న ఎమ్మెల్యే వివేక్ కక్ష్య సాధింపుతో దాని ఊసే ఎత్తడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కలగూర రమేశ్, రాజన్న, వడ్ల కొండ పవన్, సుందిల్ల మల్లేశ్, యువ నాయకులు దాసరి మణిదీపక్, భూక్య రాజేశ్‌నాయక్ పాల్గొన్నారు.

భీమారం, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం రైతాంగానికి శాపంగా మారింది. గొల్లవాగు ప్రాజెక్టు తూములోని రెండు షటర్లు శిథిలమైపోగా, సకాలంలో మరమ్మతులు చేయక నీరంతా వృథాగా పోయింది. ప్రస్తుతం ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరుకుంటుండగా, చివరి వరకూ పంటలకు నీరందుతుందో లేదోనన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

భారీగా తగ్గిన నీటిమట్టం

వానకాలంలో భీమారంలోని గొల్లవాగు ప్రాజెక్టు తూములోని రెండు షటర్లు పాడైపోయాయి. ఇందులో ఓ షటర్ విరిగిపోగా, మరో షటర్ మధ్యలో ఇరుక్కుపోయింది. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, లీకేజీని అరికట్టేందుకు వరదకు అడ్డుగా ఎండుగడ్డితో పాటు ఇసుక బస్తాలు వేశారు. అయినా.. వరద ఆగలేదు. ప్రాజెక్ట్ నుంచి వరద లీకై నీటి మట్టం భారీగా తగ్గింది. డిసెంబర్ 2న ఒక షటర్‌కు తాత్కాలిక మరమ్మతులు (వెల్డింగ్) చేశారు. అప్పటికే నీరంతా వృథాగా పోయింది. ప్రస్తుతం ఎండలు ముదరడంతో ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరింది. 0.5 టీఎంసీల నీరు ఉండాల్సి ఉండగా, 0.07కు టీఎంసీల నీరు ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, ఇప్పటికైనా కొత్తగా రెండు షటర్లు ఏర్పాటు చేయాలని, లేదంటే వచ్చే వానకాలంలోనూ నీరంతా వృథా అయ్యే అవకాశముందని రైతులు చెబుతున్నారు.

చి'వరి' వరకూ నీరందేనా..

గొల్లవాగు ప్రాజెక్టు ప్రధాన కాలువతో పాటు 39 డిస్ట్రిబ్యూటరీ కాలువల ద్వారా భీమారం మండలంలోని కొత్తపల్లి, మద్దికల్, ఎల్కేశ్వరం, ఆరెపల్లి, చెన్నూర్ మండలంలోని గంగారాం, ఓత్కులపల్లి, ఆస్నాద్, అంగ్రాజ్‌పల్లి, దుగ్నేపల్లి, చెల్లయ్యపేట, రాజీపేట్, కొమ్మెర, ఎర్రగుంటపల్లి గ్రామాల్లోని (సుమారు 26 కిలోమీటర్ల దూరం వరకు కాలువలు ఉన్నాయి) 9500 ఎకరాలకు సాగు నీరందించాలి. కానీ, ఆయా గ్రామాల్లో ఈ యేడాది 8000 ఎకరాలు సాగు చేసినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీకి చేరుకున్నది. మరో నెల లోగా పంటలు చేతికందనుండగా, చివరి వరకూ సాగు నీరందుతుందో లేదోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక భీమారం మండల రైతులు పూర్తిగా గొల్లవాగు ప్రాజెక్ట్ మీద ఆధారపడి సాగు చేస్తుంటారు. అర్కపల్లి శివారులో 200 ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. గొల్లవాగు ప్రాజెక్ట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఇక్కడి పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. ఇప్పటికే 100 ఎకరాలు వరకు ఎండిపోయినట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా గొల్లవాగు ప్రాజెక్ట్ కాలువ ద్వారా అర్కపల్లి చెరువును నింపాలని, అలా చేస్తే కనీసం ఉన్న పంటలనైనా కాపాడుకోవచ్చని రైతులు చెబుతున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వా, అధికారులు చొరవ తీసుకొని తమ గోస తీర్చాలని వారు వేడుకుంటున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయండి

ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



జైనూర్ : చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్, ఏప్రిల్ 10 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ కల్యాణ లక్ష్మి పథకం ద్వారా రూ. లక్షతో పాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాదవ్‌రావ్, పీఏసీఎస్ చైర్మన్ కొడప హన్మా పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతియాజ్‌లాలా, ఎంపీడీవో సుధాకర్, తహసీల్దార్ ఆడ బీర్‌షావ్, జీపీ ఈవో ఆనంద్‌రావ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు ఉన్నారు.

హనుమాన్ జయంతి పోస్టర్ ఆవిష్కరణ

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 10 : ఆసిఫాబాద్‌లోని కెస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ఈ నెల 12న నిర్వహించనున్న హనుమాన్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే కోవలక్ష్మి గురువారం తన నివాసంలో ఆలయ కమిటీతో కలిసి ఆవిష్కరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అరిగెల నాగేశ్వరరావు నివాసంలోనూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుండ వెంకన్న, ఆలయ కమిటీ ప్రముఖులు పిన్న వివేక్, ఏకీ రాల శ్రీనివాస్, చిలుకూరి రాధాకృష్ణ చారి, డాక్టర్ మధు, మురళీగౌడ్, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు కూలీ మృతి

మరో ముగ్గురికి స్వల్ప గాయాలు

చెన్నూర్ రూరల్, ఏప్రిల్ 10 : బోరు మోటర్‌కు మరమ్మతులు చేస్తుండగా, ఓ రైతు కూలి మృతి చెందిన ఘటన మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం నాగాపూర్‌లో గురువారం చోటు చేసుకున్నది. చెన్నూర్ ఎస్ఐ వెంకటేశ్వర్ రావు కథనం ప్రకారం.. నాగాపూర్ గ్రామానికి చెందిన బడికెల లచ్చయ్య రైతుకు చెందిన వ్యవసాయ బోరు మోటర్ చెడిపోయింది. మరమ్మతుల అనంతరం రైతు కూలీ కర్ణాల లింగయ్య (48)తో పాటు మరో ముగ్గురు బావిలోకి మోటర్ దింపారు. ఆపై లింగయ్య భుజంపై మోటర్ పైపును పెట్టుకొని వెనక్కి వస్తున్న క్రమంలో విద్యుత్ తీగలు పైపుకు తగలడంతో షాక్ తగిలింది. అక్కడికక్కడే ఆయన మృతి చెందాడు. పాంతెపు రంజిత్, బడికెల లచ్చయ్య, అంగ రమేశ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఘటనా స్థలాన్ని కొమ్మెర ట్రాన్స్‌కో ఏఈ కేశెట్టి శ్రీనివాస్ పరిశీలించారు. మృతునికి విద్యుత్ శాఖ నుంచి నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. మృతునికి భార్య పరిమిల, కూతురు, కుమారుడు ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ వెంకటేశ్వర్ తెలిపారు.

ఆదివాసీ సంస్కృతి గొప్పది

- ఉత్తర్‌ప్రదేశ్ ప్రత్యేక బృందం
- మార్లవాయిలో పర్యటన

హైమన్‌డార్ఫ్ దంపతుల విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్ బృందం సభ్యులు

జైనూర్, ఏప్రిల్ 10 : ఆదివాసీ సంస్కృతి ఎంతో గొప్పదని ఉత్తర్‌ప్రదేశ్‌రాష్ట్ర ప్రత్యేక బృంద సభ్యులు పేర్కొన్నారు. గురువారం మార్లవాయిలో పర్యటించారు. అడవిబిడ్డలు వారికి బొట్టుపెట్టి రుమాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. కుమ్రం భీం, హైమన్ డార్ఫ్ ఎలిజబెత్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడి చేపట్టిన అభివృద్ధి పనుల గురించి డీఆర్డీవో దత్తరాం, జడ్పీ సీఈవో లక్ష్మీ నారాయణ, డీపీవో భిక్షపతిగౌడ్ వారికి వివరించారు. శ్మశాన వాటిక, సెగ్రిగేషన్ షెడ్డు, పల్లె ప్రకృతి వనం, డిజిటల్ లైబ్రరీ, హైమన్ డార్ఫ్ మ్యూజియం, నర్సరీ తదితర అభివృద్ధి పథకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఐకేపీ, ఈజీఎస్, గ్రామ పంచాయతీల్లో చేపట్టే కార్యక్రమాలు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మార్లవాయి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, తహసీల్దార్ బీర్షావ్, ఐకేపీ ఉద్యోగి రాజ్‌కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నగేశ్, ఎంపీవో మోహన్, పంచాయతీ కార్యదర్శి మనోజ్, గ్రామ పటేల్ ఆత్రం భగవంతు రావు, గ్రామస్తులు కనుక గణపతి, ప్రతిభ, వెంకటేశ్, జమున, సావిత్ర, ఐకేపీ సీసీలు, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్యాస్ మంట

- సిలిండర్ ధర పెంపుపై సీపీఎం ఆగ్రహం
- తాండూరులో కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన
- నస్పూర్‌లో సీపీఐ నాయకుల రాస్తారోకో

గ్యాస్ సిలిండర్లతో నస్పూర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

తాండూర్, ఏప్రిల్ 10 : గ్యాస్ ధర పెంపుపై సీపీఎం, సీపీఐ భగ్గుమన్నది. వెంటనే సిలిండర్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. గురువారం తాండూర్ గ్రామ పంచాయతీలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మహిళలు కట్టెల పొయ్యిపై వంట చేసి నిరసన తెలిపారు. సీపీఎం తాండూరు మండల కార్యదర్శి దాగం రాజారాం మాట్లాడుతూ కేంద్ర సర్కారు కార్పొరేట్లకు ఊడిగం చేసేందుకు ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నదని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు దశరథం, రాజేశం, పుష్ప, లక్ష్మి, సంఘవి, లక్ష్మీబాయి, తిరుపతమ్మ, లక్ష్మి, చిన్నక్క, సుమ, పాల్గొన్నారు.

నస్పూర్‌లో సీపీఐ రాస్తారోకో

సీసీసీ నస్పూర్, ఏప్రిల్ 10: గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ నస్పూర్‌కాలనీలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జాతీయ రహదారిపై సీపీఐ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై సిలిండర్లలతో నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీపీఐ పట్టణ కార్యదర్శి జోగుల మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర రూ.50 పెంచడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు తగ్గుతుంటే.. ఇక్కడ కేంద్రం పెంచడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగం రవి, మొగిలి లక్ష్మణ్, దొడ్డిపట్ల రవీందర్, తంగళ్లపల్లి సురేశ్, నర్సింగరావు, కొత్తపల్లి మహేశ్, లచ్చిరెడ్డి, హరీశ్, బాకం శంకరయ్య, లింగయ్య, మొగురం రాకేశ్, మేరుగు రాములు, రమేశ్, బత్తుల క్రాంతి పాల్గొన్నారు.

తాండూర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, మహిళలు